క్లుప్తంగా...

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.4.89 కోట్లతో పలు డివిజన్లలో 18 పనులకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పనులకు మంత్రి చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పారిశుద్ధ్య కార్మికుడు కుర్మన్న సేవలు భేష్



కుర్మన్నను సత్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఏలు, కార్మికులు

మల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికుడు జి.కుర్మన్న సేవలు భేష్‌అని తోటి కార్మికులు కొనియాడారు. కుర్మన్న ఆరోగ్యం సహకరించకపోవడంతో తన విధులను కుమారుడికి అప్పగించారు. శనివారం తోటి కార్మికులు ఎస్‌ఎఫ్‌ఏలు మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద కుర్మన్నను సత్కరించారు. అనంతరం కార్మికులు, ఎస్‌ఎఫ్‌ఏలు మాట్లాడుతూ 20 ఏళ్లుగా మల్లాపూర్‌లో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూ తోటి కార్మికులకు ఆదర్శంగా ఉండటం అభినందనీయం అన్నారు. ఎస్‌ఎఫ్‌ఏలు లక్ష్మీ, బి.గోవర్ధన్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు ఉన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుల్లో ప్రదీప్‌కుమార్



అల్వాల్: తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో అల్వాల్‌కు చెందిన సూక్ష్మ కళాకారుడు పున ప్రదీప్ కుమార్‌కు చోటు లభించింది. సూక్ష్మ కళాకారుడైన ప్రదీప్‌కుమార్ 100కు పైగా చిత్రాలను రావి ఆకులపై రూపొందించారు. ఇప్పటి వరకు వివిధ సంస్థల నుంచి 13 ప్రశంసా పత్రాలను ఆయన అందుకున్నారు.

సీసీ రోడ్డు వేయాలని వినతి



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అన్నపూర్ణ కాలనీవాసులు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని కోరుతూ శనివారం ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనికి కార్పొరేటర్ సానుకులంగా స్పందిస్తూ రోడ్లను వేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, దశరథ్, వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, ఎండీ ముబీన్, మున్నీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



శ్రవణ్‌ను పరామర్శిస్తున్న సదానంద్ తనవాడే

మల్కాజిగిరి: కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్‌ను గోవా బీజేపీ అధ్యక్షుడు ఎంపీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సదానంద్ తనవాడే పరామర్శించారు. ఇందిరాపార్కు వద్ద కిషన్‌రెడ్డి చేపట్టిన నిరుద్యోగ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసిన సందర్భంగా శ్రవణ్ గాయపడ్డాడు.

కల్తీని ఎలా గుర్తించాలో అవగాహన



అల్వాల్: ఆహార పదార్థాల కల్తీ, భద్రత, ప్యాకింగ్‌పై అల్వాల్‌లోని లయోలా కాలేజీ విద్యార్థులకు కానుకుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం అవగాహన కల్పించారు. కల్తీని ఎలా గుర్తించాలి, భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలు, ప్యాకింగ్ చేయడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నీరజ, సర్పంచ్ లీలమ్మ పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్

- ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా..
- ఎమ్మెల్యే మైనంపల్లి చేరికతో.. ఆశావహుల్లో ఆందోళన
- పార్టీ బలపడుతుందని పలువురిలో ఉత్సాహం..
- మరోవైపు అసంతృప్తులు చేజారకుండా కసరత్తు
- మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇదీ



సాక్షి, మేడ్చల్ జిల్లా: హస్తినకు చేరిన తుది జాబితాలో తమ పేర్లు ఉన్నాయో.. లేదోనన్న ఉత్కంఠ కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో తీవ్ర టెన్షన్‌కు గురిచేస్తోంది. టికెట్ పైరవీల కోసం ఆశావహులు ఎవరూ ఢిల్లీకి రావొద్దని అధిష్టానం ఇప్పటికే నాయకులకు సంకేతాలు ఇచ్చింది. సర్వే ఆధారంగానే టికెట్లను కేటాయిస్తామని, ఈసారి పైరవీలకు ఆస్కారం లేదని, గెలుపు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేసింది. చివరి ప్రయత్నంపై ఆశలు పెట్టుకున్న నేతలకు అధిష్టానం ఢిల్లీకి రావొద్దని షాక్ ఇవ్వడంతో నిరాశే మిగులుతోంది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని ఆశావహుల్లో టికెట్ వస్తుందా? లేదా? అనే సందిగ్ధత తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో.. జిల్లాపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ఫోకస్ పెడుతోంది. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో.. పార్టీ శ్రేణుల్లో నూతనోత్సవాన్ని నింపుతుండగా, మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ టికెట్లు ఆశిస్తున్న ఆశావహులను మాత్రం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

తీవ్ర అసంతృప్తితో నందికంటి శ్రీధర్

సిట్టింగ్ ఎమ్మెల్యే, సీనియర్ నేత మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నప్పటికీ, ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన అనుచరులు మాత్రం మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్ నందికంటికే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం కావడంతో పార్టీకి పెద్ద తలనొప్పిగా మారిందన్న చర్చ ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లోకి మైనంపల్లి

మల్కాజిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్ ప్రకటించినప్పటికీ, కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వలేదన్న అసంతృప్తితో రాష్ట్ర మంత్రి హరీష్‌రావుపై తీవ్ర విమర్శలు చేయటంతో పాటు రాజకీయ భవిష్యత్‌పై కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు షరతులు కూడా విధించినట్లుగా జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మల్కాజిగిరి తనకు, మెదక్‌లో తనయుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వాలన్న డిమాండ్‌తో పాటు జిల్లాలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాను సూచించిన వారికి టికెట్ ఇవ్వాలన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే.. ఎమ్మెల్యే మైనంపల్లి పెట్టిన షరతుల విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సిందేనన్న సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో లేకపోలేదు.

బుజ్జగించే ప్రయత్నం

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ నేతల రాకతో.. పార్టీలో నెలకొన్న అసంతృప్తి వాదులను బుజ్జగించేందుకు అధిష్టానం ఆదేశాల మరకు పార్టీ పెద్దలు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. తాత్కాలికంగా నిరాశతో ఉన్న నాయకులను సంతృప్తి పరిచేందుకు పలు హామీలతో నచ్చజెబుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. వారికి కట్టబెట్టనున్న పదవులు, ఇతర విషయాలను పేర్కొంటూ.. బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో కొంత నైరాశ్యం కనిపిస్తుండగా, వారితో పార్టీ పెద్దలు మంతనాలు జరుపుతుండటంతో పాటు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకునే లక్ష్యాన్ని విస్మరించకూడదన్న విషయాన్ని మాత్రం నొక్కి చెబుతున్నారని స్థానిక కేడర్ పేర్కొంటోంది.

విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా..



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: పేద విద్యార్థులను ఆదుకునేందుకు మధుర చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని ట్రస్ట్ ప్రతినిధి పి.నరసింహారెడ్డి అన్నారు. శనివారం నాచారం వెస్లీ హైస్కూల్లోని విద్యార్థులకు ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి సహకారంతో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నామని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందిస్తూ.. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లడానికి సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎంఏ సమద్, అమీర్, కీసర రామకృష్ణారెడ్డి, శివ, జితేందర్‌రెడ్డి, పవన్ కుమార్, అజీజ్, మదన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలి



ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో మర్రి రాజశేఖర్‌రెడ్డి



జితేందర్‌రెడ్డి తదితరులతో మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి/గౌతంనగర్: బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలని మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జితేందర్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించడానికి ప్రజల వద్దకు వెళ్లి అభివృద్ధి పథకాలతో పాటు పథకాల లబ్ధిదారుల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మురుగేష్, అరుణ్‌సింగ్, బద్దం పరశురామిరెడ్డి, వెంకన్న తదతరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: పేద ప్రజలకు మంజూరైన సీఎం రిలీఫ్ చెక్కులను శనివారం 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ అందజేశారు. 25వ డివిజన్ కళానగర్‌కు చెందిన రమేష్‌కు రూ.42 వేలు, బాలచిత్తారి నగర్‌కు చెందిన వెంకటేశ్‌కు రూ.17 వేల చెక్కులు మంజూరయ్యాయి. ఆయన నివాసంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతలు తూర్పాటి లక్ష్మియాదయ్య, పడతం లోకేష్, నామాల రవి, కొండ రాంచందర్, పోతుల మల్లేష్, బాలరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్, రాంశంకర్‌నగర్, ఈస్ట్ శ్రీనివాసపురంలో రోడ్లు పూర్తిగా పాడై వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదేవిధంగా స్టాంగ్ వాటర్ డ్రైన్ లేన్ లేకపోవడంతో రోడ్లపైనే మురుగు పారుతోందని శనివారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం సమర్పించారు. త్వరలో సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

ప్రైవేట్ స్కూల్ టీచర్లకు సత్కారం



ప్రైవేటు టీచర్లను సన్మానిస్తున్న ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ జయప్రదబాయి తదితరులు

ఉప్పల్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రైవేటు టీచర్లను గౌరవిస్తూ శనివారం ఈసీఐఎల్ లయన్స్ క్లబ్ ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ బి.జయప్రద బాయి, విశిష్ట అతిథిగా ప్రజాకవి జయరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్‌లో విశిష్ట సేవలు అందించిన కుషాయిగూడ గౌతం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వారు అభినందనలు తెలుపుతూ సత్కరించారు. వి.పురుషోత్తం, ఎం.కాశేశ్వరరావు, బీ.వీరమణి, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మీ సన్మానం అందుకున్నారు. కార్యక్రమంలో కీసర మండల ఎంఈవో శశిధర్, డా.అవినాష్, టి.రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల అమరవీరుల త్యాగాలు మరువలేనివి



హెచ్‌బీకాలనీలో జెండావిష్కరిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్, ఎరుకల సంఘం సభ్యులు

కుషాయిగూడ: ఎరుకల కులాన్ని వారి పోరాట ఫలితంగా షెడ్యూల్ ట్రైబల్ జాబితాలో చేర్చిన రోజును పురస్కరించుకొని శనివారం తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీకాలనీలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కార్పొరేటర్ ప్రభుదాస్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్ హాజరై జెండా ఆష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎరుకల అమరవీరుల 20 సంవత్సరాల త్యాగాల ఫలితమే ఎరుకల సంఘాన్ని ఎస్టీ జాబితాలో చేర్చారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహ, నాయకులు అంజయ్య, మల్లేష్, నవీన్‌గౌడ్, నవీన్, రాములు, భాస్కర్, ఎల్లయ్య, సమ్మయ్య, లక్ష్మీ, దుర్గవేణి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు

పోచారం: మున్సిపాలిటీలో రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, నారపల్లిలో వీధి కుక్కలను నియంత్రించడం, బతుకమ్మ పండగ, ఏర్పాట్లు, ఎల్‌ఐజీలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తున్న కౌన్సిల్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు మహేశ్, ధనలక్ష్మీ, రాజశేఖర్, సాయిరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, బాల్‌రెడ్డి, లక్ష్మీ, శ్రీలత, రవీందర్, సరిత, సుధాలక్ష్మీ, మమతారాణి, ఏఈ నరేశ్‌కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో మేడ్చల్– మల్కాజిగిరి అడిషన్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య సెక్టోరియల్ అధికారులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల విధి విధానాలు, అధికారుల అప్రమత్తత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సెక్టోరియల్ అధికారులకు వివరించారు. అందుకు సంబంధించిన శిక్షణ కూడా ఇచ్చారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 39 సెక్టార్లు ఉన్నాయి. బీఎల్‌వోలు, జీహెచ్‌ఎంసీ, తహసీల్దార్ కార్యాలయ అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. ఉప్పల్ తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ ఆకుల శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఉప్పల్ ఏఎంసీ శ్రీనివాస్, కాప్రా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవో-59 అమలుపై అవగాహన

కాప్రా: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వం ఆక్రమిత భూముల్లో నివసిస్తున్న ప్రజల కోసం నిర్దేశించిన జీవో–59 అమలుపై కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ మతిన్ మట్లాడుతూ జీవో 59 కింద దరఖాస్తు చేసుకొని రుసుము చెల్లించిన వారు యాజమాన్యం హక్కులను పొందుతారన్నారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిని తొలగించాలి



కేవీపీఎస్ సమావేశం

మల్కాజిగిరి: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతలు వైఫల్యం చెందాయని ఇటీవల మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో ఘటనకు బాధ్యులను చేస్తూ ముఖ్యమంత్రిని తొలగించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. మల్కాజిగిరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కేవీపీఎస్ సమావేశంలో మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. సమావేశంలో కృపాసాగర్, కొండల్, బాలయ్య, శ్రీను, పెంటయ్య పాల్గొన్నారు.

చీర్యాలలో రూ.36 లక్షలతో అభివృద్ధి పనులు

కీసర: చీర్యాల గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ తుంగ ధర్మేందర్ అన్నారు. శనివారం గ్రామంలో సుమారు రూ.36 లక్షలతో చేపట్టిన వైకుంఠధామం ప్రహరీగోడ, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సీసీరోడ్డు, మహిళా డ్వాక్రా గ్రూప్ భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి



పౌర హక్కుల వేడుకల్లో కార్పొరేటర్ అనిత యాదగిరి

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి అన్నారు. 13వ డివిజన్‌లో శనివారం జరిగిన పౌర హక్కుల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విఘాతం కలగకుండా తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గోపు రాము, నాగభూషణం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ వైద్య సేవలు



వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్

బోడుప్పల్: పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ అన్నారు. ఆయూష్ గ్రామ్‌లో భాగంగా జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల ఆధ్వర్యంలో చెంగిచర్ల ఎంఎల్‌ఆర్ కాలనీలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దవాఖాలు ఏర్పాటు చేసి పేదలందరికీ వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. క్యాంప్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ఎంఎల్‌ఆర్ కాలనీ ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, డాక్టర్లు తేజస్విని, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లోకి లింక్ రోడ్డు మంజూరుపై హర్షం



లింక్ రోడ్డును చూపిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న భగాయత్ అసోసియేషన్ ప్రతినిధులు

ఉప్పల్: ఉప్పల్ హెచ్‌ఎండీఏ భగాయత్ లే అవుట్‌లోకి స్థానికుల సౌకర్యార్థం ఉప్పల్ నుంచి లింక్ రోడ్డును కలుపుతున్నట్లు అధికారులు ప్రకటించారని ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్ భగాయత్ ఓనర్ల వినతిని స్వీకరించి లింక్ రోడ్డు సౌకర్యం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. భగాయత్ నుంచి ఉప్పల్‌కు వెళ్లేందుకు స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, లింక్ రోడ్డు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు గతంలో వినతులను అందజేసినట్లు వారు తెలిపారు. సుమారు 7.5 మీటర్ల రోడ్డును మంజూరు చేయడంపై అసోసియేషన్ ప్రతినిధులు మేకల మధుసూదన్‌రెడ్డి, కందికంటి అశోక్ కుమార్‌గౌడ్, బజారు పాండు, జెట్ట సుధాకర్, వాకిటి బుచ్చిరెడ్డి తదితరులు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

లోప్రెషర్ సమస్యలకు చెక్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో నీటి కొరత, లోప్రెషర్ సమస్యలు ఉండవని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. ఓఆర్‌ఆర్ ఫేస్–2 పనుల్లో భాగంగా చిలుకానగర్ అబ్దుల్ కలాం విగ్రహం నుంచి చిలుకానగర్ చౌరస్తా వరకు దాదాపు రూ.60 కోట్లతో నిర్మిస్తున్న పైపులైన్ పనులను శనివారం జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పైప్‌లైన్ ఏర్పాటులో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జగన్, బింగి శ్రీను, శ్రీనివాస్ యాదవ్, ఎండీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

రేవంత్ కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

మల్కాజిగిరి: అమెరికాలో ఎంఎస్ చేయడానికి వెళ్లి మృతి చెందిన మల్కాజిగిరి మారుతీనగర్‌కు చెందిన రేవంత్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పరామర్శించారు. కుటుంబసభ్యులతో ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహం ఇండియాకు తీసుకొని రావడానికి తనవంతు కృషి చేస్తానన్న రాంచందర్‌రావు కేంద్ర మంత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. పరామర్శించిన వారిలో అసెంబ్లీ కన్వీనర్ సదానంద్‌గౌడ్ ఉన్నారు.